నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురంలోని 33 కెవి లైన్ పనులు కారణంగా మండలానికి సంబంధించి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఎఇ బొంతాడ శంకర్రావు తెలిపారు. పార్వతీపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు 132 కెవి ఎస్ఎస్ నిర్వహణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నిర్వహణ పనులు కారణంగా గరుగుబిల్లి, నాగూరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలతో పాటు జియ్యమ్మవలస మండలంలోని చినకుదమ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఎఇ తెలిపారు.

రంగుమారిన ధాన్యం నూరు శాతం కొనుగోలు

- పండగలోపే పంటనష్ట పరిహారం
- పిఆర్ బొబ్బిలి ఇఇ సరెండర్‌కు ఆదేశం
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో మంత్రి బొత్స
- రూ.1045 కోట్లతో జెడ్‌పి బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో రంగుమారిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలని జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఇటీవల తుపాను సందర్భంగా నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండగ లోపే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు. పనిలో తీవ్ర అలసత్వం ప్రదర్శించిన పిఆర్ బొబ్బిలి ఇఇని వెంటనే సరెండర్ చేయాలని మంత్రి బొత్స కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. రంగు మారిన ధాన్యం ఎన్ని ఎకరాల్లో ఉండవచ్చు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోవడంతో విజయనగరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1045 కోట్లతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవం ఆమోదం తెలిపింది.

జెడ్‌పి చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం సర్వ సభ్య సమావేశం, దీనికి ముందుకు బడ్జెట్ సమావేశం జరిగాయి. సమావేశంలో తొలుత వ్యవసాయం, సివిఎల్ సప్లై విభాగాలపై చర్చసాగింది. పాచిపెంట మండలం విశ్వనాధపురానికి చెందిన ఓ రైతు ధాన్యం రంగు మారినందున అధికారులు తక్కుధరకు కొనుగోలు చేశారని, ప్రభుత్వం మాత్రం వాస్తవ ధర కల్పిస్తున్నట్టు చెబుతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు ట్రాన్స్‌పోర్టు సమస్య కూడా ఎదుర్కొంటున్నారని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి బొత్స రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు తగ్గింపు లేకుండా చెల్లింస్తుందని, అందుకనుగుణంగానే అధికారులు సేకరించాలని సూచించారు. ఆన్‌లైన్ విధానం వల్ల ధాన్యం మిల్లర్లకు కేటాయింపులో జాప్యం జరుగుతోందని, ఫలితంగా ఇటు మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలకు అనుగుణంగా పని ఉండడం లేదని, అటు రైతులు కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేదా? అన్న సందేహంలో పడుతున్నారని పలువురు జెడ్‌పి సభ్యులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఈనేపథ్యంలో ఆఫ్ లైన్ విధానం ద్వారా మిల్లులకు ధాన్యం కేటాయించాలని చేసిన విజ్ఞప్తి మేరకు మంత్రి బొత్స అందుకనుగుణంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డిఆర్‌డిఎ కార్యకలాపాలపై చర్చనడుస్తుండగా వచ్చే నెలలో పింఛన్లు, చేయూత కార్యక్రమాల నిర్వహణపై మంత్రి సుమారు గంటపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్ధేశం చేశారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాల భవనాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఉపాధిహామీ కన్వర్జెన్స్ నిధులతో చేపట్టిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు అంచనా వ్యయాన్ని చెల్లించేందుకు బొబ్బిలి పంచాయతీరాజ్ ఇఇ నిరాకరిస్తున్నారని తెర్లాం ఎంపిపి ఉమాదేవి ప్రస్తావించారు. ఆ డివిజన్‌లోని ఇతర ప్రజాప్రతినిధులు కూడా అసహనం వ్యక్తం చేయడంతో ఇఇ శ్రీనివాసరావు సరెండర్‌కు మంత్రి బొత్స ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, శాసన మండలి సభ్యులు రఘురాజు, రఘువర్మ, జెడ్పీ సి.ఇ.ఓ. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



క్రైం వార్షిక నివేదికను వివరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ముందస్తు చర్యలతో నేరాలు తగ్గుముఖం

పెరిగిన రోడ్డు ప్రమాదాలు • వార్షిక నివేదిక వెల్లడించిన ఎస్‌పి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ముందస్తుగా పటిష్ట చర్యలతో పోక్సో, రేప్ నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పి విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఏడాది వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌తో మహిళలపై జరిగే నేరాలు, తీవ్రమైన నేరాలు తగ్గుముఖం పట్టాయని, సారా నిర్మూలనే లక్ష్యంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో భాగంగా జిల్లాలో 17 తీవ్రమైన నేరాల్లో శిక్షలు ఖరారయ్యాయని చెప్పారు. వీటిలో మహిళలు, బాలికలపై జరిగిన నేరాల్లో 7 కేసుల్లో 20ఏళ్లు, యావజ్జీవ ఖైదు శిక్షలు ఖరారయ్యాయి. ఇదే క్రమంలో హత్యలు, హత్యయత్నం, మహిళలపై దాడులు, కొట్లాటలు, ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు తగ్గాయని తెలిపారు. మహిళలపై జరిగిన అఘాయిత్యాలు ఈ ఏడాది 24 కేసులు నమోదయ్యాయన్నారు. మహిళల గౌరవానికి భంగం కల్గించే కేసులు 58 కేసులు, పోక్సో కేసులు 18, మైనర్ బాలికల అపహరణ కేసులు 9 నమోదయ్యాయని తెలిపారు. మహిళలపై జరిగిన నేరాలు ఈ ఏడాది 211 కేసులు,. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు 35కేసులు, లాభాపేక్ష హత్యలు, దోపిడీలు, హత్యాయత్నాల కేసులు 5, కొట్లాట, హత్యా యత్నం 8, ఇతర కొట్లాట కేసులు 150 నమోదయ్యాయన్నారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డుప్రమాదాలు, మరణాలు పెరిగాయి. 2022లో 267 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా, 77 మంది మృతి చెందారు. 437 మంది గాయపడగా, 2023లో స్వల్పంగా 3శాతం కేసుల సంఖ్య పెరగ్గా, 275 కేసులు నమోదై 95 మంది మృతి చెంది 389 మంది గాయపడ్డారు. గతేడాది డ్రంక్, డ్రైవ్ కేసులు 125 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 2781 కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 2022లో 1962 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 10,054 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై 2022 901 కేసులు నమోదు కాగా, 2023లో 1643 కేసులు నమోదు చేశామన్నారు. దొంగతనాలకు సంబంధించి గతేడాది రూ.78,46,100 విలువైన ఆస్తులు చోరీకి గురి కాగా, వాటిలో రూ.37,50,136 విలువైన ఆస్తులు రికవరీ చేశామని, ఈ ఏడాది రూ.50,66,860 విలువైన ఆస్తులు చోరీకి గురి కాగా, వాటిలో 52.21 శాతం కేసులను ఛేదించి 44.18 శాతం అనగా రూ.22,38,894 విలువైన ఆస్తులు రికవరీ చేసినట్లు తెలిపారు. అలాగే మిస్సింగ్ కేసులకు సంబంధించి గతేడాది 127మంది తప్పిపోగా 115 మందిని వెతికి పట్టుకోగా, ఈ ఏడాది 100 మంది తప్పిపోగా 88 మందిని వెతికి పట్టుకొని, వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షకులకు సురక్షితంగా అప్పగించామని తెలిపారు.

540 నాటుసారా కేసులు నమోదు

ఈ ఏడాది నాటు సారా వ్యాపారంపై విస్తృతంగా దాడులు చేసి 540 కేసులు నమోదు చేసి, 15,914 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 609 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌పి తెలిపారు. గతేడాది 98 కేసులు నమోదు చేసి 498. 61 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకోగా, ఈ ఏడాది 121 కేసులు నమోదు పరచి 845.54 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 127 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని చెప్పారు. ఇక గంజాయి అక్రమ రవాణా దారులపై ఈ ఏడాది ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 14 కేసులు నమోదు చేసి, 27 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 205.64 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి కేసుల్లో కఠిన చర్యలు చేపట్టి, గంజాయి వినియోగిస్తున్న వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించామని, స్కూళ్లు, కాలేజీల్లో మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి పలు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో

ఇదిలా ఉండగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చేసిన దాడుల్లో నాటు సారా వ్యాపారం చేసే వారిపై ఈ ఏడాది 673 కేసులు నమోదు చేసి 23,679 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకొని 803 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపడంతో పాటు 73 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అక్రమ మద్యానికి సంబంధించి ఈ ఏడాది 205 కేసులు నమోదు చేసి, 418 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 206 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపాం. సైబర్ నేరాల సంఖ్య 2022లో 29 కాగా, 2023లో 32 కేసులు నమోదయ్యాయన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, సైబర్ నేరాలు మోసాలు జరిగే తీరు లోన్ యాప్‌ల వల్ల కలిగే అనార్ధాలను వివరించామని, నేరం జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం పట్ల అవగాహన కల్పించినట్టు తెలిపారు. అలాగే 1930 టోల్ ఫ్రీ నెంబరుకు వెంటనే కాల్ చేయడంపై అవగాహన పెంచడం వల్ల కేసుల నమోదు సంఖ్య గత ఏడాది కంటే పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ
ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని, సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. నాలుగో రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో పారిశుధ్య కార్మికులు తమ మెడలకు ఉరితాళ్లు పెట్టుకొని విన్నూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ వర్కర్లకు హెల్త్, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగవంశం శంకర్రావు, పట్టణ అధ్యక్షులు చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, గుంట్రెడ్డి గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ఉరితాళ్లు మెడకు బిగించుకొని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

వంటావార్పు చేసి నిరసన తెలిపిన కార్మికులు

సాలూరు : వంటావార్పు చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శంకర్, కార్యదర్శి రాముడు మహిళా కార్యదర్శి ఇందు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి పెరిగిన జనాభా కనుగుణంగా కార్మికులు పెంచి, కనీసవేతనాలు అమలు చేసేంత వరకూ ఆందోళనలో వెనకడుగు వేయమని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ మీడియా ఇన్చార్జ్ శ్రీను, రవి, నాయకులు, స్వప్న, పోలరాజు, ఈశ్వరరావు, సీత పాల్గొన్నారు.

పాలకొండ : జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ పాలకొండలో పారిశుధ్య కార్మికులు ఉరి తాళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ కాంటాక్ట్ ఆప్కో సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పిఆర్‌సి నివేదికల ప్రకారం వేతనాలు పెంచాలని, తదితర సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 31 నుంచి ఇంజనీరింగ్ విభాగంలో ఎలక్ట్రికల్, వాటర్ సెక్షన్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సంజీవి, సురేష్, శ్రీదేవి, పి.సూరిబాబు, వై.హరిబాబు, జి.నారాయణరావు, టి.ఈశ్వర్ కుమార్, పి.మధు తదితరులు పాల్గొన్నారు

16,033 మందికి జగనన్న విద్యాదీవెన

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న విద్యా దీవెన పథకం కింద జిల్లాలో 2022-23 త్రైమాసికానికి సంబంధించి 16,033 మంది విద్యార్థులకు రూ.10,40,93,202 కోట్లు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి భీమవరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జగనన్న విద్యా దీవెన నిధులను బటన్ నొక్కి జమ చేశారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలోని బిసికి చెందిన 9,534 మంది విద్యార్థులకు రూ.6,53,56,353, ఎస్‌సికి చెందిన 3,413 మంది విద్యార్థులకు రూ.1,57,52,457, ఎస్‌టికి చెందిన 2391మంది విద్యార్థులకు రూ. 1,75,97,097, ఇబిసికి చెందిన 480 మంది విద్యార్థులకు రూ.37,32,16, కాపుకు చెందిన 175 మంది విద్యార్థులకు రూ.13,46,904, ముస్లిం, మైనారిటీకి చెందిన 29 మంది విద్యార్థులకు రూ.2,21,877, క్రిస్టియన్ మైనారిటీకి చెందిన 11 మంది విద్యార్థులకు రూ.86,354 విద్యాదీవెన నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ అవుతుందన్నారు. అనంతరం విద్యా దీవెన నమూనా చెక్కును జాయింట్ కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ సాధికారత అధికారి ఎస్ కృష్ణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మక్కువ

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడికరాజన్నదొర అన్నారు. మండలంలోని డి.సిర్లాంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వం వల్ల కలిగిన మేలును ప్రజలకు వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసనాయుడు, సర్పంచ్ కోటేశ్వర రావు, ఎంపిటిసి వాసురెడ్డి అప్పలనాయుడు, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానికులు మావుడి.రంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల ఆకలి కేకలు జగన్‌కు పట్టవా?

18వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె • పలుచోట్ల వినూత్న నిరసనలు



గుమ్మలక్ష్మీపురంలో చేతికి సంకెళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న అంగనవాడీ అక్కచెల్లెళ్ల ఆకలి కేకలు జగనన్నకు పట్టవా అని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నాయకులు అన్నారు. అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో నిర్వహిస్తున్న నిరసన శిబిరంలో నిరాహారదీక్షలు చేపట్టారు. 'నీ పొట్ట నిండితే సరిపోద్దా..' మా పొట్టలు నింపవా జగనన్నా' అంటూ నినాదాలు చేశారు. ప్రాజెక్టు నాయకులు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సిఐటియు నాయకులు బి.లక్ష్మి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కె.రాజేశ్వరి, ఎం.గౌరీ, బి.శాంతి, ధర్మవతి అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్‌వాడీలు తమ సమస్యలపై సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో పాల్గొని ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, ట్రైబల్ రైట్ ఫోరం అధ్యక్షులు రొబ్బ లోవరాజు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, పలువురు కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.


సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె 18రోజుకు చేరింది. యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రిలేదీక్షలు చేపట్టారు.. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద నీటిలో తెప్పలు వదిలి దీపాలు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు గౌరమ్మ , సావిత్రి, పద్మావతి కాత్యాయని, హైమావతి తదితరులు పాల్గొన్నారు.


సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం నాటికి 18 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డికి తమ సమస్యలు తెలుపుతూ పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు కార్యదర్శి జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వై.సత్యవతి, జి.సునీత, ఆర్.లక్ష్మి, పద్మతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం అసత్యాలు ప్రచారంపై తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అబద్ధ ప్రచారాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, అభ్యుదయ రైతు సంఘం సీనియర్ నాయకులు ఖండాపు ప్రసాదరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, కోశాధికారి బి.అమరవేణి, పాలకొండ ప్రాజెక్ట్ అధ్యక్షులు జి.జెస్సీబాయ్, ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు ఎం.శ్యామల, ఎం.శ్రీదేవి, బి.లలిత, ఎస్.నిర్మల, బి.వసుంధర, టి.పుష్ప, ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమ్మెలో భాగంగా నాగావళి నది వరకు ర్యాలీగా వెళ్లి శివాలయం వద్ద పూజలు నిర్వహించి దీపారాధన చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు పెంచుతామన్న హామీ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమరాడ ప్రాజెక్టు యూనియన్ ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, నాయకులు బి.అలివేలు, జ్యోతి, పద్మ, మల్లేశ్వరమ్మ, ఎస్తేరాణి, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం : సిఎంకు పంపనున్న పోస్టుకార్డులతో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



కొమరాడలో నాగావళి నదిలో దీపారాధనతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సీతంపేటలో సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

కురుపాం : స్థానిక పెట్రోల్ బంకు సమీపాన చేపడుతున్న సమ్మెలో అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చొని, మెడలో పూలదండలు వేసి జగనన్నకు దండం పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ అధిక సంఖ్యలో అంగన్వాడీలు కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ కార్యదర్శి శాంతికుమారి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎ.దర్శమి, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

భామిని : మండలంలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు సబితా, ఆగుతాముడి కన్య ఆధ్వర్యంలో అంగన్వాడీ నిరవధిక సమ్మె కొనసాగతోంది. ఈ సమ్మెలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శాంతి కుమారి పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు కొండగొర్రి భాస్కరావు, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

మక్కువ: అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు టిడిపి నాయకులు పెంట తిరుపతినాయుడు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల సమ్మెకు తమ పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శంబర ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడు, కోట శంకరనాయుడు, చొక్కాపు బుచ్చింనాయుడు, కోన సర్పంచి ప్రతనిధి కన్నంనాయుడు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు వినతినిస్తూ బిక్షాటన చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల బిక్షాటన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజ్ తదితర డిమాండ్లతో ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం పదో రోజు కొనసాగింది. వీరి ఆందోళనలో భాగంగా పార్వతీపురం చర్చి కూడలి నుంచి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఆసుపత్రి కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేసి ప్రధాన రహదారిలో భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో పాటు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రమేష్, లక్ష్మణరావు, భారతి, వందన, దమయంతి, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రహదారి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

రహదారి సౌకర్యం లేనటువంటి ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని జి.శివడ పంచాయతీలో గల కొటకొండ గిరిశిఖర గ్రామానికి రూ.4కోట్లు ఉపాధి నిధులతో మంజూరై పూర్తి అయిన బిటి రహదారిని, మరిపల్లి పంచాయతీలో గల నాగరగూడ బిటి రహదారులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.మిన్నర్రావు, వైసిపి సీనియర్ నాయకులు జి.రాజారావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్‌నిసార్, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోనుబాయిలో 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి సచివాలయం పరిధిలో ఏడు సచివాలయాల్లో ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు 337 క్రికెట్ టీములు, వాలీబాల్ టీములు 37, ఖోఖో 8, కబడ్డీ 12, బ్యాడ్మింటన్ 20 టీములు పాల్గొన్నాయి. అయితే కిల్లాడ సచివాలయం ఆరు క్రికెట్ టీములు శుక్రవారం పోటీల్లో పాల్గొన్నాయని, మిగతావి ఈనెల 3న జరిగే పోటీల్లో పాల్గొంటాయని పంచాయతీ కార్యదర్శి ఎ.అప్పలస్వామి తెలిపారు. ఇప్పటికే క్రీడాకారులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో పిడి ఆర్‌సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనితీరుపై సంతృప్తి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును ఎంఇఒ డి.సూర్యచంద్రమౌళి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ఎంఇఒ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. ఎంఇఒ వెంకటరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

నేడు ఎస్‌టి కమిషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పాచిపెంట మండలం పి కోనవలసలో శనివారం పర్యటించనున్నారు. పి కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జరుగుతున్న అండర్ 17,19 బాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు - 2023 - 24 ముగింపు ఉత్సవాల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి విజయనగరం వెళతారు.

వీరఘట్టం ఎస్ఐగా గోవిందరావు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎస్ఐగా ఎం.గోవిందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఎం.వెంకటరమణకు ఎక్కడా పోస్టింగు లభించలేదు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం గోవిందరావు మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతకు భంగం కలగకుండా కృషి చేస్తానన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం సాధారణ సమావేశం, 12 గంటలకు బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ జి.రామప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కౌన్సిల్ సభ్యులతో పాటు విభాగాల అధికారులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

కీర్తికకు ఎస్‌పి ప్రశంస

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 24న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం పొందిన భర్తికల కీర్తికను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కీర్తిక జాతీయస్థాయిలో కూడా ప్రథమ స్థానం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సమాఖ్య ఇంచార్జ్ పి.నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్ రావు, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పక్కనపెట్టి ఆటలా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలెవరు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అరకు పార్లమెంట్ టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రశ్నించారు. జియమ్మ వలస మండలం ఇటికలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగున్నరేళ్ళ పాలనలో ప్రజలతో ఆడుకున్న ఆటలు చాలవా ఆడుదాం ఆంధ్ర అవసరమా అని ఎద్దేవా చేశారు. నిరుద్యోగం, అధిక ధరలతో ప్రజలు అనేక రకాలుగా కష్టాలు పడుతున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా అన్నారు. ఉద్యోగులు, రైతులు, కార్మికులతో వైసిపి ప్రభుత్వం ఆటలాడుకుందని,ఇప్పుడు ఆడుదాం ఆంధ్ర పేరుతో నిరుద్యోగ యువతతో ఆటలాడడం అమానుషం, దుర్మార్గం అన్నారు. అంగన్వాడీలు, పారిశుధ్య కార్మికులు తమ సమస్యలపై నిరసన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీన్ని టిడిపి పూర్తిగా ఖండిస్తుందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు కృష్ణబాబు

ఆస్తిపన్ను పేరు మార్పుపై ఛార్జీలు తగ్గించాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను పేరు మార్పుపై ఒక శాతం ఛార్జీ వసూలును తగ్గించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల అమ్మకమైన తర్వాత పేరు మార్పునకు సంబంధించి వసూలు చేస్తున్న ఛార్జీలు అధికం కావడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. అభివృద్ధి చెందిన పట్టణాల్లో అరశాతం ఉంటే వెనుకబడిన పట్టణంలో ఒక శాతం వసూలు చేయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. దీనిపై కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు మద్దతు పలికారు. గతంలో పని చేసిన కమిషనర్ కౌన్సిల్‌ను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. దీనికి కమిషనర్ జయరాం మాట్లాడుతూ ఆస్తిపన్ను పేరు మార్పునకు సంబంధించి ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీ అయినందున ఇప్పుడు తగ్గింపు సాధ్యం కాదని చెప్పారు. కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆఫీస్ ముందున్న ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లో లీజుకు ఇచ్చిన షాపుల యజమానులు కరోనా కాలంలో వ్యాపారాలు లేనందున జీఎస్టీ, వడ్డీ మొత్తాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరిన అంశాన్ని వాయిదా వేశారు. 29వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు గురించి పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ నిలదీశారు. ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎఇ సూరి నాయుడు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, సింగారపు ఈశ్వరరావు, గొల్లపల్లి వరప్రసాద్, జి.నాగేశ్వరరావు, నీలిమ, పి.సన్యాసమ్మ, బి.హైమసత్యవతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు

బడ్జెట్ ఆమోదం

2023-24 సవరించిన బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలను శుక్రవారం కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదించారు. ఎన్నికల నేపథ్యంలో ముందుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.4 కోట్ల 76లక్షల 87వేల 709తో సవరించిన బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. 2024-25 సంవత్సరానికి రూ.9కోట్ల 7లక్షల 62వేలతో బడ్జెట్ అంచనాలను ఆమోదించారు.

బోనెలపై ద్వారపురెడ్డి నిరసన గళం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్రపై టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ నిరసన గళమెత్తారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గం టిడిపి గెలుపే లక్ష్యంగా పాత ఇన్‌ఛార్జి స్థానంలో నియమింపబడ్డ బోనెల విజయచంద్ర వైఖరిపై ఆయన తీవ్రమైన విమర్శలు చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన పార్టీలోని సీనియర్లను కలుపుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉండగా, తనకు అనుకూలమైన కొంతమందితో కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీని గందరగోళానికి నెట్టారని అన్నారు. కొత్తగా కార్యాలయం ప్రారంభిస్తున్న విషయం సీనియర్లకు తెలపాల్సిన కనీస బాధ్యతను ఆయన విస్మరించారని అన్నారు. 30 ఏళ్లుగా పార్టీ జెండాలను మోస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నప్పుడు ఎన్నో కష్టనష్టాలకు వచ్చే నిలబడిన ముఖ్య నాయకులకు కనీస గౌరవ మర్యాదలు ఇవ్వకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల పార్టీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి తీసుకువచ్చి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలనే ఏకైక లక్ష్యంతో ఎన్ని అవమానాలు ఎదురైనా భరిస్తున్నామని, ఇలాగైతే పార్టీలో కార్యకర్తల మనుగడ కష్టమని అన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఇన్చార్జి పార్టీలోని ముఖ్యులను కలుపుకుంటూ రాబోయే ఎన్నికలను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బోయిన గోవిందరాజు, బలిజిపేట, సీతానగరం పార్వతీపురం మండలాలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రహదారి ప్రమాదాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించి, నమోదైన, దర్యాప్తులో ఉన్న నేరాల కేసులను సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న వివిధ కేసుల వివరాలు, రిజన్ వైజ్‌గా విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత కేసుల గురించి అడిగి తెలుసుకొని వాటిలో శిక్షలు పడేలా చేసి భాదితులకి న్యాయం జరిగేలచేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరిగే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అతి జాగ్రత్తతో విధి నిర్వహణ చేయాలని, ఏ చిన్న పొరపాటు జరిగిన అది సంచలనంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. గతంలో ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో జరిగిన కేసుల్లో ఎవరెవరు ముద్దాయిలుగా ఉన్నారు, వారిపై తీసుకున్న చర్యలను గురించి ముందుగా సమాచారాన్ని సేకరించాలని, ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచాలని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను, పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి నగదు బహుమతి. ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



గాంధీనగర్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

డి.బారామణికి బిటి రోడ్డు వేయాలి

గిరిజనుల రాస్తారోకో

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని డి.బారామణి గిరిజన గ్రామానికి బిటి రహదారి సౌకర్యం కల్పించే వరకు గిరిజన ప్రజల పక్షాన పోరాడుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శుక్రవారం మండలంలోని గాంధీనగర్ జంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన రాస్తారోకో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.బారామణితో పాటు ఐదు గిరిజన గ్రామాలు సొంతంగా సేకరించుకున్న తమ నిధులతో కంకర రోడ్డు వేసుకున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి నేటికి 76 ఏళ్లయినా ఇంతవరకు ఆ గ్రామాలకు కనీసం బిటీ రహదారి లేకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలోని అన్ని గిరిజన గ్రామాలకు బిటి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రమణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని గిరిజనులంతా ఏకధాటిగా జగన్మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించారని, పార్టీలు పరంగా చూడకుండా ప్రతి గిరిజన గ్రామానికి బిటి రహదారి సౌకర్యం కల్పించేలా స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల ప్రజలతో కలిసి జనవరి 8న గుమ్మలక్ష్మీపురం ఐటిడిఎ డిఇ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం నాయకులు ఎం.అడ్డమహేశ్వరరావు, బిడ్డక వెంకట్రావు, పూలక వాసు, అంగధ, వైకుంఠరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా ప్రజల్లోకి వెళ్లాలి : బోనెల

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజల వద్దకు ప్రతి క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నది వివరించాలని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం టిడిపి మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్లస్టర్, బూత ఇన్‌ఛార్జులు జనవరి 10లోగా మండల మొత్తం ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రజలకు భవిష్యత్తులో ఏం చేస్తామనేది పూర్తిస్థాయిలో వివరించి తెలుగుదేశం పార్టీని అధికారంలో తీసుకొచ్చే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం బజార్లో దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి ఆర్.వేణుగోపాలనాయుడు, నాయకులు బర్నాల సీతారాం, మండల నాయకులు దామినేని పెద్దబ్బాయి, ఎస్.హరిగోపాలరావు, బుడితి శ్రీనివాసరావు, రెడ్డి సింహాచలం నాయుడు, యోగిరెడ్డి భాస్కరరావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం : సమావేశంలో మాట్లాడుతున్న విజయచంద్ర

టిడిపిలోకి గోపాలపురం యువత

పార్వతీపురంరూరల్ : మండలంలోని గోపాలపురానికి చెందిన యువకులు శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర నాయకత్వంలో ఆయన చేతుల మీదుగా కండువాలు వేసుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ గోపాలపురంలో నిన్న కొంతమంది సర్పంచి వర్గానికి చెందిన బంధువులు వైసిపిలోకి చేరితే మొత్తం గ్రామమంతా చేరినట్లు ప్రకటించారని, గ్రామంలో యువత తమ వాలంటీర్ పోస్టులను సైతం త్యాగం చేసి టిడిపిలో చేరి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేస్తామని పార్టీలోకి వచ్చి నందుకు సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో వారికి పార్టీ సముచిత స్థానం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోల సత్యనారాయణ, బార్నాల సీతారాం, గొర్లి వెంకటరమణ, కోరాడ నారాయణరావు తదితరులు ఉన్నారు.

ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి - కురుపాం

గిరి శిఖర గ్రామాల ప్రజలను ఏనుగుల బారి నుండి ప్రాణాలకు, పంటలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండలంలో ఏనుగులు సంచరిస్తున్న తిత్తిరి పంచాయతీలో గల పలు గిరి శిఖర గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగులు సంచరిస్తున్న 16 గ్రామాల గిరిజనులు భయభ్రాంతులకు గురవుతు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారని అన్నారు. కావున ప్రభుత్వం, అధికారులు స్పందించి గిరిజనుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే పంటకు నష్టపరిహారం ఇవ్వాలని లేనిచో గిరిజన ప్రజలతో కలిసి ఏనుగులు తరలించే వరకూ ఉద్యమం చేపడతామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బిడ్డిక ఆడిత్, పత్తిక అర్జున్, బాపన్న, ఎర్రన్న, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మక్కువ

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడికరాజన్నదొర అన్నారు. మండలంలోని డి.సిర్లాంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వం వల్ల కలిగిన మేలును ప్రజలకు వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసనాయుడు, సర్పంచ్ కోటేశ్వర రావు, ఎంపిటిసి వాసురెడ్డి అప్పలనాయుడు, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానికులు మావుడి.రంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు సేవా పతకాలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐ కె.నర్సింహులు, కానిస్టేబుళ్లు ఎల్.నూకందొర, టి.భద్రరాయుడు, గౌడు సురేష్ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు శుక్రవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.షణ్ముఖరావు, తోటి పోలీస్ సిబ్బంది వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవార్డు మరికొంత బాధ్యతను పెంచిందని, విధి నిర్వహణలో శ్రద్ధ తీసుకుంటూ మరింత బాధ్యతాయుతంగా ఉంటామని అన్నారు.

ఇవిఎంలపై అవగాహన అవసరం

గుమ్మలక్ష్మీపురం : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రతి ఓటరుకు అవగాహన ఉండాలని సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోనూ, సచివాలయం వీధిలో ఇవిఎంల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఓటరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఓటును ఎలా వేయాలో తెలుసుకోవాలని అన్నారు. గతంలో కాకుండా ఇకపై ఇవిఎంలపై మాత్రమే ఓట్లు వేయాలన్నారు. అవగాహన కార్యక్రమంలో ఆర్ఐ పి.గిరిబాబు, బిఎల్ఒలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ కోస్ట వలస, కందిరివలస, పనుకువలస గిరిజన గ్రామాల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గిరిజన ప్రబంధుకుడు ప్రబారి శ్రీనివాస్ కండే అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గదబ, సవరలకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నదాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పిఎం జన్‌ధన్ వికాస్ కేంద్రాల ఏర్పాటుపై వివరించారు. అలాగే ఆయా గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు పరిశీలిస్తూ సర్వే నిర్వహించారు. ఆయన వెంట ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, సర్పంచ్ సిహెచ్ సీతారామకృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు నిల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వర్తకులు జోరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో వరి, పత్తి పండించే రైతులు ఈ ఏడాది ఎక్కువగా మోసపోయిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల నుంచి పంటలు కొనుగోలు చేస్తున్నామని చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల్లో మాత్రం కొనుగోలు చేయడం లేదన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో క్వింటా రూ.1600 నుంచి రూ.1800కు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. అలాగే పత్తి వ్యాపారులు ప్రైవేట్ వ్యాపారులకు కేవలం రూ.5800 నుంచి రూ.6వేలకు రైతుల నుంచి కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి పంటకూ సరైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

పిఎం జన్మాన్ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం జన్ మాన్ సర్వే వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. పిఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసి గిరిజనులకు గృహ నిర్మాణంపై శుక్ర వారం హౌసింగ్ అధికారులతో స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో పిఒ సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో ఆదివాసి గిరిజనుల (పివిటిజి)ను పూర్తి స్థాయిలో సర్వే చేసి అర్హులై, గృహాలు లేని అందరి జాబితా తయారు చేయాలని ఆయన అన్నారు. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారు తప్పిపోరాదనిచెప్పారు. జన్ మాన్ కార్యక్రమం కింద అందరికీ ఇళ్లు మంజూరు చేసే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డిఇలు ప్రసాద్, సోమేశ్వరరావు, సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పిఎం జన్‌మాన్ పథకంలో భాగంగా పివిటిజిలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక పథకాలు మంజూరు చేస్తాయని, అందుకు సంబంధించిన సర్వే ఇప్పటికే ప్రారంభమైందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బిస్మితా దాస్ అన్నారు. మండలంలోని అక్కన్నగూడలో పివిటిజి ప్రజలతో సమావేశం నిర్వహించారు. పిఎం జన్‌మాన్ పథకం ద్వారా 11 రకాల పథకాలు మంజూరు చేస్తామని, అందుకు అర్హత కలిగిన వారంతా ఈ సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ కల్పనకుమారి, ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, ఎంపిడిఒ గీతాంజలి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమల్లో వైసిపి విఫలం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి అధికారంలోకి రాకముందు పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 100కు 85 శాతం కూడా నెరవేరలేదని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో హామీలే తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఏజెన్సీలో సాగునీరు లేక ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొన్న రైతులను ఆదుకోవాలనే ఆలోచన లేకపోవడం విచారకరమన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజలు వైసిపి ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో ఉందని విమర్శించారు. జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు మాట్లాడుతూ యువతను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.. కార్యక్రమంలో పలువురు జనసేన, టిడిపి నాయకులు ఉన్నారు.

మూలగూడ పరిసరాల్లో గజరాజుల గుంపు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని గురువారం సాయంత్రం నాలుగు ఏనుగుల గుంపు గజపతినగరం, కాజి పురం, మూల గూడ పరిసర గ్రామాలలో ప్రవేశించి మామిడి తోటల్లో సంచరించాయి. ఏనుగుల కదలికలు నిరంతర పరిశీలనలో భాగంగా డ్యూటీలో వున్న బీట్ అధికారి లక్ష్మణమూర్తి ద్విచక్ర వాహనం వెనుక భాగాన్ని శుక్రవారం ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. ప్రస్తుతం రాత్రిళ్లు ఏనుగులు ఎటువైపు సంచరిస్తాయోనని పరిసర గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎంఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కత్తులకవిటి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులకు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యా బోధన చేయాలన్నారు. అలాగే ఎం.రాజపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.దేవరాజు టిఎల్ఎం ప్రజెంట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనిచేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీ మేట్లు ప్రభుత్వ నిబంధన ప్రకారం పని చేయాలని పార్వతీపురం క్లస్టర్ చంద్రరావు, ఎంపిడిఒ సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమైక్య కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ మేట్లు శిక్షణలో మాట్లాడారు. మెట్లు అందరూ నిబంధన ప్రకారం పనిచేయాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా సక్రమంగా హాజరు వేసి పంపించాలని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధి హామీ పనుల్లో వేతనదారు లకు తెలపాలన్నారు.శిక్షణలో ఎపిఒ శివరామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: ఉపాధి హామీ మేట్లుకు శిక్షణ నిర్వహించారు. ముందస్తు కొలతలపైన, మొబైల్ ద్వారా హాజరు పంపించడంపైనా, విధి విధానాల పైన పూర్తిస్థాయిలో అవగాహన పరుచుకొని రానున్న రోజుల్లో మరింతగా సగటు వేతనం వచ్చేలా వేతనదారులతో పని చేయించాలని సూచించారు. శిక్షణలో అజ్జాడ, చాకరాపల్లి, అరసాడ, సుభద్ర, శివరాం పురం, పనుకువలసకు చెందిన మేట్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎపిఒలు కె.కేశవరావు, ఇసి సిహెచ్ శ్రీనివాసరావు, జెఇ పి.శేఖర్‌బాబు క్షేత్ర, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి

భామిని : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు జీతం చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదరి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఇఒ శ్రీనివాసరావకు శుక్రవారం వినతిని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్మికులు రమాదేవి, సరస్వతి,రజిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - బలిజిపేట



పంతులను అడిగి మంచి ముహూర్తం కనుక్కొని శనివారం కాబోయే భార్యను చూడ్డానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న యువకుడు శుక్రవారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జెసిబి ఓనర్‌గా అందరి మన్ననలు పొందాడు ఆ యువకుడు. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం సింగిపురపు శ్రీరాములు (30) తన సొంత ఇటుక బట్టీ నుంచి మట్టిని చదును చేస్తుండగా చుట్టూ ఉన్న గోడ ట్రాక్టర్‌కు తగలడంతో ట్రాక్టర్ అదుపుతప్పి అతనిపై బోల్తా పడడంతో మట్టిలోకి కూరుకుపోయి గుండెకు బలమైన గాయాలు తగలడంతో హాస్పటిల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌కు మృతి దేహాన్ని పంపించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. అల్లారు ముద్దుగా చూసుకుని ఎంతో అంగరంగ వైభవంగా పెళ్లి చేయాలనుకున్న తల్లిదండ్రుల ఆశలు నిరాశలుగా మారడంతో స్థానికుల్లో కూడా విషాదఛాయలు అలముకున్నాయి.